సాక్షి
అనంతపురం
శనివారం, 7, జనవరి, 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.10 పలికింది. కనిష్టంగా రూ.3, సరాసరి రూ.5.50 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.3°/14.5°

జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం కొనసాగింది. పగలు ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గదలగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీలపై విజి'లెన్స్'



విడపనకల్లు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెద్దవడుగూరు: విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రసాద్, ఏడీ రవీంద్ర శుక్రవారం పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఆస్పత్రికి వచ్చిన నిధులు.. చేసిన ఖర్చుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం నూతనంగా చేపట్టిన భవన నిర్మాణ పనులతో పాటు ఆపరేషన్ థియేటర్, బాలింతల గదిని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస బాబు, అమర్‌నాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: విడపనకల్లు పీహెచ్‌సీని విజిలెన్స్ అధికారులు ఎస్ఐ బాలకృష్ణ, ఏజీ శివ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, మందులు పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- సమగ్ర సమాచారంతో రండి
- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ




అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి శాఖాధిపతులు సమగ్ర సమాచారంతో రావాలని చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు తన అధ్యక్షతన ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఇక్బాల్ అహమ్మద్, వై.శివరామిరెడ్డి, ఎంపీలు రంగయ్య, మాధవ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, బసంత్‌కుమార్, 14 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరవుతారని పేర్కొన్నారు. గత సమావేశాల్లో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలతో పాటు ఈసారి జరిగే సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేలా సిద్ధమై రావాలని సూచించారు. సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందని, బయటి వ్యక్తులెవరూ సమావేశ భవన్‌లోకి అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా రంగజనార్దన



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీగా ఉన్న ప్రొఫెసర్ జింకా రంగజనార్దన యోగి వేమన యూనివర్సిటీ (కడప) ఇన్‌చార్జ్ వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. యోగి వేమన యూనివర్సిటీ వీసీ సూర్యకళావతి పదవీ కాలం ముగియడంతో ఇన్‌చార్జ్ వీసీని నియమించారు. రెగ్యులర్ వీసిని నియమించేంత వరకు రంగజనార్దన ఇన్‌చార్జ్‌గా కొనసాగనున్నారు.

ఉగాదికి 14 వేల ఇళ్లు పూర్తి కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: ఉగాది నాటికి జిల్లాలో 14 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదలందరికీ ఇళ్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన అన్ని ఇళ్లు సంక్రాంతి నాటికి గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీల్లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. బిల్లుల చెల్లింపు, ఇసుక, స్టీల్ సరఫరాలో సమస్య లేనందున నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుతల అలజడి




- గత ఏడాది డిసెంబర్‌లో కళ్యాణదుర్గం నియోజకవర్గం హులికల్లు దగ్గర ఓ పశువుల మందపై చిరుత దాడిచేసి ఆవుదూడను చంపింది. చిరుత దాడిలో మరికొన్ని పెయ్య దూడలు గాయపడ్డాయి. నియోజకవర్గంలో అడపాదడపా చిరుత దాడులు జరుగుతుండటంతో పశువుల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు.





- గత ఏడాది నవంబర్‌లో పెనుకొండ సమీపాన వీరన్న కొండ దగ్గర మేకల మందపై చిరుత దాడిచేసింది. ఒక మేకను చంపేసి గుట్టలోకి ఈడ్చుకెళ్లింది. ఈ చిరుత వయసు రెండేళ్ల వరకూ ఉండవచ్చునని ఫారెస్టు అధికారులు అంచనా వేశారు. ఈ ఘటన అనంతరం నెల రోజులకే పెనుకొండ నియోజక వర్గం బొక్కసం పల్లి వద్ద ఉచ్చులో ఇరుక్కుని చిరుత మృతిచెందింది.

- ఇక్కడ కనిపిస్తున్న గుట్ట గూబనపల్లి సమీపంలోనిది. గ్రామంలోని నక్కరాయి గుట్ట వద్ద 30 అడుగుల సొరంగం మాదిరి గుహ ఉంది. ఇందులో చిరుతలు తలదాచుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఆహారం కోసం వెళ్లి తెల్లారేసమయానికి గుహలోకి వెళ్తుంటాయి. ఈ గుట్ట నుంచి పగలే చిరుతలు బయటికి రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



చిట్టడవులు.. గుట్టలు చిరుతలకు ఆవాస ప్రాంతాలు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటువంటి పరిసరాలు చాలా ఉన్నాయి. అందుకే చిరుతలు ఈ ప్రాంత పరిసరాలను ఆవాసాలుగా చేసుకున్నాయి. ఆహారం కోసం గొర్రెలు, మేకలు, పశువుల మందలపై దాడులు చేస్తున్నాయి. ఎక్కువగా కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నట్టు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

- ఏడాదిలో 21 సార్లు జీవాలపై దాడి
- ఇప్పటివరకూ 42 పశువులు, గొర్రెల మృతి
- ఉమ్మడి జిల్లాలో 30కి పైనే చిరుతలున్నట్లు అంచనా
- ఇక్కడి పరిసరాలు అనుకూలంగా ఉండటమే కారణం
- వంకలు, గుంటల్లో పుష్కలంగా నీళ్లుండటం మరింత సానుకూలం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో చిరుతలు అలజడి రేపుతున్నాయి. చిరుతలు సాధారణంగా దట్టమైన అడవుల్లో ఉండవు. ఎక్కువగా పచ్చిక బయళ్లు, చిన్న చిన్న పొదలతో కూడిన అడవుల్లో ఉంటాయి. ఈ కారణంగానే చిరుతలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. రికార్డుల ప్రకారం చిరుతల సంఖ్య 10 నుంచి 15 వరకే అని చెబుతున్నా గడిచిన రెండేళ్లలో ఈ సంఖ్య 30 నుంచి 40 వరకూ చేరుకుని ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అడపాదడపా దాడులు

జిల్లాలో చిరుతలు ఎక్కువగా ఉన్నాయనేందుకు దాడులే ఉదాహరణ. 2022 సంవత్సరంలో ఏకంగా 21 సార్లు పశువులు, గొర్రెల మందలపై దాడులు చేశాయి. ఇందులో 42 పశువులు మృతి చెందాయి. దీంతో పాటు జింకల తర్వాత ఎక్కువగా కుందేళ్లను తినడానికి బాగా ఇష్టపడతాయి. ఉమ్మడి జిల్లాలో కుందేళ్ల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల చిరుత పులులు అనుకూల ప్రాంతాలుగా మలచుకున్నాయి. ఇప్పటి వరకూ జన సమూహాల్లోకి వచ్చి అలజడి సృష్టించిన దాఖలాలు లేవు. కానీ ఇటీవలే కళ్యాణదుర్గం సమీపంలో ఓ చిరుత వాహనం ఢీకొట్టగా మరణించింది. రాత్రి పూట రోడ్డు దాటుతుండగా ఈ ఘటన జరిగినట్టు ఫారెస్టు అధికారులు గుర్తించారు.

గత ఏడాది చిరుతల దాడి వివరాలు

జీవాలు	మృతి చెందిన వాటి సంఖ్య
దూడలు	5
మేకలు	4
గొర్రెపిల్లలు	15
గొర్రెలు/పొట్టేళ్లు	18
మొత్తం	42

వేట దొరికితే నాలుగు రోజులు అదే మేత

చిరుతలు ఏదైనా పెద్ద జంతువును వేటాడితే దానిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లి నాలుగైదు రోజుల పాటు ఆరగిస్తాయి. రెండ్రోజుల పాటు ఎలాంటి ఆహారం లేకపోయినా చిరుతలు ఉండగలవు. అయితే ఆ సమయంలో రోజుకు ఒకటి లేదా రెండు సార్లు ఎక్కడైనా నీటి లభ్యత ఉన్న ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తాగుతాయి. విచిత్రమేమంటే చిరుత దేన్నయినా వేటాడితే దానికంటే ఎక్కువ బరువున్న జంతువునైనా అరకిలోమీటరు వరకూ ఈడ్చుకుని తీసుకెళ్లగలవు. 20 అడుగుల చెట్టుపైకీ తీసుకెళ్లగలదు.

చిరుతలకు అనుకూలమైన ప్రదేశం



చిన్న చిన్న పొదలు, ఓ మోస్తరు చెట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా ఫారెస్టులో బాగున్నాయి. అంతేకాదు జిల్లాలో వేసవిలోనూ వాగులు, గుంటల్లో నీళ్లున్నాయి. కాబట్టి ఈ ప్రదేశం సానుకూలంగా ఉంది. గతేడాది చిరుత పులుల దాడిలో నష్టపోయిన పశువుల యజమానులకు రూ.2.79 లక్షల పరిహారం ఇచ్చాం.
– సందీప్ కృపాకర్, జిల్లా అటవీశాఖాధికారి

ఎరువుల కొరత రానివ్వం

- అందుబాటులో తగినన్ని ఎరువులు
- డీఏఓ చంద్రానాయక్ వెల్లడి



నిల్వ ఉన్న ఎరువుల బస్తాలు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ఎరువుల కొరత రానివ్వకుండా ఏడాది పొడవునా అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ తెలిపారు. వివిధ కంపెనీల నుంచి జిల్లాకు సరఫరా అయ్యే అన్ని రకాల ఎరువులను మార్క్‌ఫెడ్ ద్వారా మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలకు పంపుతున్నామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), హోల్‌సేల్, రిటైల్ డీలర్ల వద్ద తగినంత నిల్వలు ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్, ఇతర కంపెనీ గోదాముల్లో కూడా బఫర్ స్టాక్ కింద ఉంటుందన్నారు. ప్రస్తుత రబీలో జిల్లాకు 75 వేల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేసి.. అందుకు అనుగుణంగా ఎరువులు తెప్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 25 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అందులో 11 వేల మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్‌లు, 8 వేల మెట్రిక్ టన్నులు యూరియా, 3 వేల మెట్రిక్ టన్నులు డీఏపీ, 1,500 మెట్రిక్ టన్నులు ఎంఓపీ, 1,500 మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ ఎరువులు ఉన్నాయన్నారు. ఇందులో ఆర్‌బీకేల్లో 2,800 మెట్రిక్ టన్నులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

గనులు, భూగర్భ శాఖ డీడీగా రాజశేఖర్

అనంతపురం టౌన్: గనులు, భూగర్భ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా రాజశేఖర్‌ను నియమిస్తూ డైరెక్టర్ వెంకటరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు డీడీగా పని చేసిన పాపారావు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తుండడంతో ఆయన్ని కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో కర్నూలు జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు అనంతపురం డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు చెక్

నార్పల మండలంలోని ఓ గ్రామంలో జాబ్‌కార్డ్ కలిగిన కూలీ ఉపాధి పనులు చేయకపోయినా వేతనం అందుతోంది. అంతేకాదు గడ్డం నాగేపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో బడికెళ్లే విద్యార్థుల పేరిట జాబ్‌కార్డులు ఇచ్చారు. వారు పనులకు వెళ్లినట్లు మస్టర్లలో నమోదు చేసి నిధులు పక్కదారి పట్టించారు. ఇది ఒక్క నార్పల మండలంలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేతివాటం ప్రదర్శించారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన సాఫ్ట్‌వేర్ (ఎన్ఎంఎంఎస్)ను తీసుకొచ్చింది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- జాబ్‌కార్డులు ఆధార్‌తో లింక్
- కూలి పనులకు వెళ్లేనే వేతనం
- ఏ రోజుకారోజు యాప్‌లో నమోదు
- నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అక్రమాలకు చెక్ పెట్టడంలో భాగంగా కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తోంది. అసలైన కూలీలకు లబ్ధి చేకూరేలా చేపట్టిన ఈ చర్యలు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.8 లక్షల జాబ్ కార్డులు, 6 లక్షలకు పైగా కూలీలు ఉన్నారు. వీరిలో ఏటా 50 శాతం లోపు కూలీలు పనుల్లో పాలుపంచుకుంటున్నారు. మిగిలిన వారు ఇతర రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే అలాంటి వారు 'ఉపాధి' పనుల్లో పాల్గొన్నట్లు కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు బోగస్ రికార్డులు సృష్టించి నిధులు దుర్వినియోగం చేసేవారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం

ఎన్ఎంఎంఎస్ విధానం అమలులో భాగంగా ఉపాధి హామీ జాబ్‌కార్డును కూలీల ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. జిల్లా వ్యాప్తంగా కూలీల మొత్తం వివరాలు సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తమైన తర్వాత శ్రమ శక్తి సంఘాల ఆధ్వర్యంలో రోజువారీగా ఎంత మంది పనులకు హాజరయ్యారనే వివరాలను ఫొటోలతో సహా ఏ రోజుకారోజు క్షేత్రస్థాయి నుంచే మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఆటోమేటిక్‌గా ఆ రోజు వేతనం జనరేట్ అవుతుంది. గతంలో మ్యానువల్‌గా కూలీల వివరాలను మస్టర్లలో నమోదు చేసి, ఆ వివరాలను మండల కార్యాలయానికి పంపితే అక్కడ వేతనాన్ని జనరేట్ చేసేవారు. ఇందులోని లొసుగులను ఆధారంగా చేసుకుని కొందరు 'ఉపాధి' సిబ్బంది పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడేవారు.

90 శాతానికి పైగా అనుసంధానం

జాబ్‌కార్డులకు కూలీల ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియ 90 శాతానికి పైగా పూర్తయింది. ఈ విధానం వల్ల ఉపాధి పనుల్లో అక్రమాలకు తావుండదు. ఇప్పటికే చాలా మండలాల్లో ఎన్ఎంఎంఎస్ యాప్‌లోనే పని ప్రాంతం నుంచే కూలీల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో పనిచేసిన పాత ఫొటోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. దీంతో పనుల్లో పాల్గొనే నిజమైన కూలీలకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది.
– వేణుగోపాలరెడ్డి, డ్వామా పీడీ

రేపు గ్రూప్–1 ప్రిలిమ్స్

- 26 కేంద్రాల్లో పరీక్ష
- 9,926 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
- కోవిడ్ నిబంధనలు పాటించాలి
- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 8న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై జేసీ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఆర్వో గాయత్రీదేవి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ అపరంజినితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అనంతపురం పరిధిలోని 26 కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు 9,926 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీఎఫ్–7 కొత్త వేరియంట్ నేపథ్యంలో కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరగనున్న పరీక్ష నిర్వహణకు 26 మంది లైజన్ అధికారులను, 26 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు జయశ్రీ, భారతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అరగంట ముందే చేరుకోవాలి

పరీక్ష సమయానికి అరగంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని జేసీ సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 9.30 గంటల లోగా, మధ్యాహ్నం 1.30 గంటల లోగా పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు చేరుకోవాలన్నారు. 15 నిమిషాలు గ్రేస్ టైమ్ ఉంటుందని, ఆ తరువాత కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్, ఓటర్ ఐడీ కార్డు వంటివి చూపించాలని సూచించారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోరని పేర్కొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

బుక్కరాయసముద్రం: వసతిగృహాల విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి హెచ్చరించారు. కొర్రపాడు గ్రామంలోని డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం ఆర్జేడీ తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను పరిశీలించారు. ఎంత మంది బాలికలు ఉన్నారు.. ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు..? అని ఆరా తీశారు. వంట చేసే సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఈఈ శివకుమార్, ఎంఈఓ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళిక తప్పనిసరి

అనంతపురం: ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికతో తరగతి గదిలోకి వెళ్లాలని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలురు), శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ హైస్కూల్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. టీచర్ డైరీ రాయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'అనంత సంకల్పం' కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. రౌండ్-2లో ఎన్ని మార్కులు వచ్చాయి? ఏ సబ్జెక్టులో మార్కులు ఎలా రాబట్టాలో విద్యార్థులకు వివరించారు. ఆకర్షణీయంగా దస్తూరి రాసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొర్రపాడు గురుకుల పాఠశాల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

మధ్యవయసు ఓటర్లే అధికం

అనంతపురం అర్బన్: జిల్లాలో మధ్య వయసు ఓటర్లు (30–39) 31.54 శాతంతో అగ్రభాగంగా ఉన్నారు. ఇక 18–19 వయసు ఓటర్లు 0.83 శాతంతో అత్యల్పంగా ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 19,39,163 మంది ఓటర్లు ఉన్నారు. వయసు వారీగా ఓటర్లను పరిశీలిస్తే.. మొత్తం ఓటర్లలో 30–39 మధ్య వయసు ఓటర్లు 5,86,395 మంది, 18–19 ఏళ్ల వయసున్న ఓటర్లు 15,476 మంది ఉన్నారు. 2023 అంచనా జనాభా ప్రకారం 18–19 ఏళ్ల వయసు వారు జిల్లాలో 66,620 (2.41 శాతం) మంది ఉన్నట్లుగా అధికారికంగా నిర్ధారించారు. ఈ వయసు వారిని ఓటరుగా నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినా ఆశించిన స్థాయిలో చేర్పించలేకపోయారు. దీంతో 15,476 మంది మాత్రమే ఓటరుగా నమోదయ్యారు. ఓటర్లలో 40–49 ఏళ్ల వయసు ఓటర్లు 4,17,929 (22.48శాతం) మంది ఉన్నారు. 20–29 ఏళ్ల మధ్య వయసు వారు 3,25,218 (17.49శాతం) మంది ఉన్నారు. 50–59 ఏళ్ల మధ్య వయసు వారు 2,90,467 (15.62 శాతం) మంది, 60–69 మధ్య వయసు వారు 1,79,262 (9.64 శాతం) మంది ఉన్నారు. 70–79 మధ్య వయసు వారు 94,771 (5.10 శాతం) మంది, 80 ఏళ్లు ఆ పై వయసు వారు 29,645 (1.59 శాతం) మంది ఉన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఆఫీస్ ఆటోమేషన్, ల్యాండ్ సర్వేయింగ్ వంటి సర్టిఫికెట్ కోర్సుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఫైర్ సేఫ్టీ కోర్సుకు ఇంటర్మీడియెట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుకు డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన వారు, లేదా రెండు సంవత్సరాల అనుభవం ఉన్నవారు, ల్యాండ్ సర్వేయింగ్, ఆఫీస్ ఆటోమేషన్‌కు పదో తరగతి పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 17 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఐదు రోజులు వర్షాల్లేవ్

బుక్కరాయసముద్రం: జిల్లాకు రానున్న ఐదు రోజులూ వర్ష సూచన లేదని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పగలు ఉష్ణోగ్రతలు 30.5–31.4, రాత్రి 17.8–18.6 డిగ్రీలుగా నమోదు కావచ్చని పేర్కొన్నారు.

రెండు క్లస్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

అనంతపురం టౌన్: జిల్లాలో రెండు పరిశ్రమల క్లస్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు తెలిపారు. కళ్యాణదుర్గంలో రూ.5.72 కోట్లతో బంగారు, సిల్వర్ ఆభరణాల తయారీ యూనిట్ మిషనరీ మంజూరు కోసం ప్రాజెక్టు రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపామన్నారు. అలాగే, వజ్రకరూరులో అగ్రిప్రాసెస్ యూనిట్ కోసం అక్కడి రైతులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవడంతో రూ.9.98 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఆమోదం లభించగానే మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రూ.10 కోట్లలోపు యంత్ర సామగ్రి కొనుగోలు కోసం సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే యూనిట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. యూనిట్ విలువలో లబ్ధిదారులు 5 శాతం చెల్లిస్తే చాలని, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం, కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులను మంజూరు చేస్తామని వివరించారు. వృత్తిదారులు సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆత్మహత్యకు ముందు వేరే గదికి!

- విద్యార్థి ఆత్మహత్య కేసు దర్యాప్తు ముమ్మరం
- చాణిక్య రెడ్డి స్నేహితులను విచారించిన పోలీసులు
- ప్రేమ వ్యవహారం కాదని నిర్ధారణ



జేఎన్‌టీయూలోని ఎల్లోరా హాస్టల్ భవనం, (ఇన్‌సెట్) చాణిక్యనందరెడ్డి (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రెండు రోజుల క్రితం అనంతపురం జేఎన్‌టీయూలో కలకలం రేపిన విద్యార్థి ఆత్మహత్య కేసు దర్యాప్తును వన్‌టౌన్ పోలీసులు ముమ్మరం చేశారు. జేఎన్‌టీయూ (ఏ)లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన రమణారెడ్డి, విజయ దంపతుల కుమారుడు చాణిక్య నందరెడ్డి గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు వర్సిటీలోని ఎల్లోరా హాస్టల్‌లో చాణిక్య ఉంటున్న నంబర్ 131 గదిలోని నలుగురు విద్యార్థులతో పాటు చాణిక్య ఆత్మహత్య చేసుకునే ముందు నిద్రించిన గదిలోని అత్యంత సన్నిహితున్ని శుక్రవారం విచారణకు పిలిచారు. ఎవరితో పెద్దగా విభేదాలు లేవని, ప్రేమ వ్యవహారాలు కూడా నడవలేదని, ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై తమకూ స్పష్టత లేదని వారు చెప్పినట్లు సమాచారం. అయితే, డిసెంబరు 31 రాత్రి నుంచి చాణిక్య మూడీగా ఉన్నట్లు వెల్లడించినట్లు తెలిసింది.

ఆత్మహత్యకు ముందు 134 గదిలోకి..

చాణిక్య తను ఉండాల్సిన 131 నంబరు గదిలో కాకుండా 134లోకి రావడానికి కారణాన్ని కూడా పోలీసులు తెలుసుకున్నారు. తనతో పాటు ఇంటర్ నుంచి కలసి చదువుతున్న విద్యార్థి నరేంద్ర ఈసీఈ తీసుకున్నాడు. తను 134 గదిలో ఉంటున్నాడు. దీంతో ఎక్కువగా చాణిక్య కూడా అతనితో గడిపేవాడు. చనిపోయే ముందు కొన్ని గంటల ముందు కూడా చాణిక్య అక్కడే పడుకున్నాడు. కాగా తను ఎప్పుడు నిద్ర లేచి వెళ్లాడో తెలియదని నరేంద్ర అంటున్నాడు. తను చనిపోయిన విషయం హాస్టల్‌లో విద్యార్థులకు కూడా ఆరు గంటల దాకా తెలియదంటున్నారు. ఇదిలా ఉండగా హాస్టల్ టెర్రస్ పైభాగాన చాణిక్య చెప్పులు వదిలేసి ఉండటం పోలీసులకు అనుమానాన్ని పెంచుతోంది.

సెల్‌ఫోన్‌లోనూ నో క్లూ..

చాణిక్యనందరెడ్డి సెల్‌ఫోన్‌ను తనిఖీ చేసిన పోలీసులకు అందులో ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రేమ వ్యవహారాలుంటే అందులో ఏదో ఒక చోట సంభాషణ, లేదా పంపిన సందేశాలుండేవి. అయితే, అలాంటివి లేవంటున్నారు. గతంలో జేఎన్‌టీయూలో జరిగిన ర్యాగింగ్ బ్యాచ్‌ల్లో చాణిక్య ఉన్నాడా? అని కూడా ఆరా తీయగా, వాటితో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తెలిసినట్లు సమాచారం. ఆర్థిక సమస్యలుండవచ్చనే కారణాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవముండవచ్చని కూడా పోలీసులు అనుమానించారు. కుటుంబం ఆర్థిక సమస్యల్లో ఉందేమోగాని.. చాణిక్య వరకు అలాంటి ఇబ్బంది లేదు. కారణం తను దుబారా ఖర్చులు చేసేవాడు కాదట. చదువు మినహా మరో వ్యాపకం కూడా లేదని అత్యంత సన్నిహితులు చెబుతున్నారు. తాజాగా తనకు వచ్చిన రూ. 60 వేల స్కాలర్‌షిప్ కూడా తండ్రి ఖాతాలోకి మళ్లించాడు. లోన్‌యాప్స్, క్రెడిట్‌కార్డులు లాంటి అవకాశం కూడా లేదని పోలీసులు చెబుతున్నారు. సెల్‌ఫోన్‌లో ఎక్కడా ఆ జాడలు లేవు. కాని చాణిక్య తను చనిపోయే ముందు సెల్‌ఫోన్‌లో టైప్ చేసి ఉంచిన మైఫైల్స్ సందేశంలో మాత్రం.. వ్యక్తిగత సమస్యలతోనే చనిపోతున్నట్లు ఉంది. తన సోదరి గీతారెడ్డికి పంపిన సందేశంలోని సారాంశాన్ని పరిశీలించిన పోలీసులు కుటుంబ ఆర్థిక పరిస్థితితోనే చాణిక్య ఆత్మహత్య చేసుకున్నాడా? అన్న కోణంలో విచారణ సాగిస్తున్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- ఎంపీ తలారి రంగయ్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

బొమ్మనహాళ్/బెళుగుప్ప: అందరూ సమానమేనని చెప్పి సమతా భావనకు పునాది వేసిన బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుండ్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ నిర్మించిన కాంపౌండ్, గ్రిల్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీ రంగయ్య మాట్లాడుతూ అనేక భాషల్లో రచనలు చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అనంతరం అంబేడ్కర్ చైతన్య స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, అంబేడ్కర్ మిలీనియం కమిటీ ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సమీకృత కాల్ సెంటర్

అనంతపురం అర్బన్: వినియోగదారులకు మెరుగైన సేవలందించే క్రమంలో వారి నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా 'సమీకృత కాల్ సెంటర్ – 1967'ను ఏర్పాటు చేస్తున్నటు జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల పదో తేదీ సమీకృత కాల్ సెంటర్ అందుబాటులోకి వస్తుందని, కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని వెల్లడించారు.

సేవలు.. ఫిర్యాదులు

పౌర సరఫరాల శాఖ, ఒకే దేశం ఒకే రేషన్ కార్డు, రాష్ట్ర ఆహార కమిషన్, తూనికలు, కొలతలకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్లను సమీకృత కాల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లు జేసీ తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సరఫరా, పెట్రోల్ బంకులు, తూనికలు, కొలతలు, బియ్యం కార్డు సేవలు, ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

సర్వీసు హోం అభివృద్ధికి చర్యలు



చిన్నారులను పరిశీలిస్తున్న ఆర్జేడీ పద్మజ

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోని సర్వీసుహోం, బాలసదనం, శిశుగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ రాయలసీమ ఆర్జేడీ పద్మజ తెలిపారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆమె హోంలను తనిఖీ చేశారు. జేఎన్‌టీయూ రోడ్డులోని సర్వీసు హోంను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బుద్ధప్పనగర్, శిశు గృహాలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు, చిన్నారుల సంరక్షణను అడిగి తెలుసుకున్నారు. హోమ్స్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

బాల సదనాల పరిశీలన ..

జిల్లాలోని మహిళా,శిశు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసదనాలను ప్రత్యేక బృందం సభ్యులు పరిశీలించారు. నివేదికలను ఆ శాఖ డైరెక్టర్ సిరికి అందజేయనున్నట్లు తెలిపారు.

లోన్‌యాప్‌ల ఉచ్చులో పడొద్దు

- వేధిస్తే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి
- ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: లోన్ యాప్‌ల జోలికెళ్లి ఉచ్చులో చిక్కుకోవద్దని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సులువుగా రుణాలు ఇస్తున్నారన్న ఆశతో లోన్ యాప్‌లకు యువత ఆకర్షితులై ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారని చెప్పారు. లోన్ యాప్‌లలో చాలా వరకు నకిలీవే ఉన్నాయన్నారు. తక్కువ వడ్డీ అంటూ ఊరించి ముగ్గులోకి దింపాక ఊహించని వడ్డింపులుంటాయని హెచ్చరించారు. డబ్బు గుంజేందుకు ఎంతకైనా తెగబడతారని చెప్పారు. అశ్లీష వీడియోలు పంపి దుష్ప్రచారం కూడా చేస్తారన్నారు. ఈ విషయం చాలా సంఘటనలతో స్పష్టమైందన్నారు. ఇబ్బందికర పరిస్థితులను చూసి భయపడటం మానేయాలని, అధైర్య పడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. 1930కి ఫోన్ చేసి సమస్యను చెప్పుకోవచ్చన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి గుర్తింపు పొందిన బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వద్ద మాత్రమే రుణాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంతటి కష్టంలో ఉన్నా జీవితం అక్కడితో ముగిసి పోతుందన్న భావనలో మాత్రం పడరాదని ఎస్పీ సూచించారు.

రేపు తపాలా ఉద్యోగుల సమావేశం

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ పరిధిలోని తపాలా ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా గ్రామీణ సడక్ సేవక్ యూనియన్ డివిజన్ ప్రతినిధులు కృష్ణయ్య, ఆరోగ్యప్ప శుక్రవారం తెలిపారు. రామచంద్రనగర్‌లోని డివిజన్ పోస్టల్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయ పై అంతస్తులో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కామ్రేడ్ కేశవరావు, రాము అధ్యక్షతన జరిగే సమావేశంలో ఏడో వేతన కమిటీ అమలు కాని అంశాలపై ప్రధానంగా చర్చ జరుగుతుందని వెల్లడించారు. సభ్యులందరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- పోస్టర్లు విడుదల చేసిన మంత్రి ఉషశ్రీచరణ్



జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. సుమారు 16 కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. యువత తమ పేర్లను అదే రోజు నమోదు చేయించుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలకు 8247885109, 6304049368, 7880202003 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ విషయంపై గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అవగాహన కల్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయ్‌మెంట్ అధికారిణి కళ్యాణి, సీడాప్–డీఆర్‌డీఏ జాబ్స్ జిల్లా మేనేజర్ సూర్య నారాయణ, స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీఓ ఆనంద్‌రాజ్‌కుమార్, సీడాప్ జాబ్స్ కో ఆర్డినేటర్ ఓబిలేశులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బుక్కరాయసముద్రం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఆమె పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి రూ. కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్య అందించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని సూచించారు. వంట సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను జెడ్పీటీసీ భాస్కర్ ఆమె దృష్టికి తీసుకెళ్లగా, నివేదిక తయారు చేసి పంపాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, కొర్రపాడు భాస్కర్ రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ కొర్రపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకురాలు మనేరి కొండమ్మ సాకే లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

110 క్యూసెక్కుల నీరు విడుదల



కూడేరు: కుడికాలువ లీకేజీకి మరమ్మతులు చేయిస్తున్న డీఈలు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటి సరఫరా పెంచినట్లు నీటి పారుదల శాఖ డీఈలు హనుమంతరావు, ఫక్కీరప్పలు శుక్రవారం తెలిపారు. గురువారం 50 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశామని, రెండో రోజు 110 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. కుడి కాలువ 6వ కిలో మీటర్ వద్ద లీకేజీ అవుతుంటే మరమ్మతు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు సుబ్రమణ్యం, రమణ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఓటమి భయంతో ఉన్మాదిలా చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



తాడిపత్రి: ఓటమి భయంతో తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. స్థానిక నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పంలో ఉద్దేశపూర్వకంగానే పోలీసులను బెదిరిస్తూ చంద్రబాబు హైడ్రామా చేస్తున్నారన్నారని విమర్శించారు. అనుమతి తీసుకోకపోవడమే కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రమంతటా ప్రజలకు సంక్షేమ పథకాలను ఎలా అందజేస్తున్నారో, అలాగే కుప్పం నియోజకవర్గంలో సైతం అన్ని పథకాలు పెద్ద ఎత్తున అమలవుతున్నాయన్నారు. దీంతో అన్ని వర్గాల నుంచి సీఎంకు ఆదరణ పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ సత్తా ఏ పాటిదో ప్రజలు చూశారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన చంద్రబాబు సానుభూతి కోసం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకోకుండా, మరి కొందరిని బలి చేద్దామన్న ఆలోచనతో ముందుకెళ్తున్నారని విమర్శించారు. ఆయనకు ప్రజలపై ఏ మాత్రం ప్రేమ లేదన్నారు. ప్రాణం విలువ తెలిసిన ముఖ్యమంత్రి కనుకనే వైఎస్ జగన్ జీఓ నంబర్ –1 తీసుకొచ్చారని, ఇది వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు కూడా వర్తిస్తుందన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారంటూ ప్రతిపక్షాలు నానా యాగీ చేస్తుండడం గర్హనీయమన్నారు. నారా వారి దొంగ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ తగిన బుద్ధి చెబుతారని పైలా స్పష్టం చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన భార్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ఓ భార్య తన భర్తపై 'దిశ' పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రాజరాజేశ్వరీ తెలిపిన మేరకు... స్థానిక వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న యామినీ, గోవర్దన్‌లకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఓ బాబు ఉన్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వారి వేధింపులు అధికం కాగా, పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అయినా గోవర్దన్, అతని తల్లిలో మార్పు రాలేదు. వేధింపులు మరింత ఎక్కువ కావడంతో బాధితురాలు శుక్రవారం అనంతపురం దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులును ఆశ్రయించింది. విచారణ జరిపిన డీఎస్పీ కేసు నమోదు చేయాలని ఆదేశాలు చేశారు. భర్త గోవర్దన్‌తో పాటు అతని తల్లి విజయనిర్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

యూత్ ఫెస్టివల్‌కు ఎంపిక



మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నీరజ

అనంతపురం సప్తగిరి సర్కిల్: భారత యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 16 వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో నిర్వహించనున్న 26వ యూత్ ఫెస్టివల్‌కు నలుగురు మెడికోలు ఎంపికయ్యారు. ఎంపికైన మెడికోలు పరిణీతసాయి, బండి పావని, మహేంద్ర, సునత్ పవన్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ అభినందించారు. రాష్ట్రం నుంచి 12 మంది ఎంపిక కాగా, వారిలో అనంతపురం మెడికల్ కళాశాల నుంచి నలుగురు ఉండడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

నేడు 'గడప గడపకూ...

అనంతపురం క్రైం: నగరంలోని 47వ డివిజన్ రంగస్వామి నగర్‌లో శనివారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రంగస్వామినగర్ బోర్డు నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫ్రైడే డ్రైడే పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఫ్రైడే డ్రైడే పోస్టర్లను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల అపరిశుభ్రత వల్లే అనేక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి

రాప్తాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడి సాధించాలని గాండ్లపర్తి యూనిట్ ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ దేవి రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని జి.కొత్తపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ రైతు గోవింద్ రెడ్డి పొలంలో 400 కేజీలు, మధుసూదన్ రెడ్డి పొలంలో 550 కేజీలు ఘన జీవామృతం తయారు చేయించి, ఘన జీవామృతంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏంపీఈవో నళినాక్షి, ఐసీఆర్పీలు ఓబుళపతి, భాస్కర్ రెడ్డి, ఎల్ఎఫ్‌లు కుల్లయమ్మ, చంద్రశేఖర్, వలంటీర్ పావని తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు కాపాడుకోవాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం: సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగేహరిత అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంపీ లక్ష్మయ్య, ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణాదేవి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రైజింగ్ రాజశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు చెన్నూరు మహమ్మద్ అబ్బాస్ ఇమామ్, ప్రకాష్, సునీల్, శ్రీనివాసులు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం మాటున టీడీపీ దోపిడీ



మాట్లాడుతున్న కేవీ రమణ

రాప్తాడురూరల్: గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల మాటున టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ నాయకులు దోచుకున్నారని రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ సచివాలయం-3 పరిధిలోని ఆదర్శనగర్‌లో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కేవీ రమణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో భాగంగా ప్రతి కుటుంబానికీ రూ.లక్షలు లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగినా సంక్షేమ పథకాలు అందేవికాదన్నారు. జగనన్న చేస్తున్న సాయంతో ప్రతి కుటుంబమూ సంతోషంగా ఉందన్నారు. సర్పంచ్ తేజశ్విని, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు వెంకీ, రామలక్ష్మీ, అన్ను, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తిరు కల్యాణోత్సవాలు

అనంతపురం కల్చరల్: స్థానిక సోమనాథ్‌నగర్‌లోని కోదండరామాలయంలో ధనుర్మాసంలో వేర్వేరుగా సాగే కల్యాణోత్సవాలను ఒకేసారి నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం, శ్రీసీతారాముల కల్యాణోత్సవంతో పాటు శ్రీ గోదారంగనాథుల తిరు కల్యాణాలు నిర్వహిస్తారు.

నిరుపయోగంగా జెడ్పీ భవనాలు

అనంతపురం నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయ భవనాలు నిరుపయోగంగా మారాయి. 1959లో జెడ్పీ కాంపౌండ్‌లో పలు భవనాలు నిర్మించారు. ఈ భవనాల్లో కొన్ని వినియోగంలో లేకపోవడంతో బూతుబంగ్లాలను తలపిస్తున్నాయి. వీటిని పూర్తిగా నేలమట్టం చేసి, ఆ ప్రదేశంలో షాపింగ్ మాల్స్ నిర్మిస్తే జిల్లా పరిషత్‌కు ఆదాయం సమకూరుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. జెడ్పీ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకున్నట్లు లేదు. గతంలో ఒకసారి ఇక్కడ మల్టిపుల్ షాపింగ్ మాల్ నిర్మించాలని యోచించి, మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేశారు. అయితే అంతటితో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. జిల్లా పరిషత్‌కు ఆదాయ వనరులు సమకూరాలంటే షాపింగ్‌మాల్ నిర్మించడం అనివార్యం. ఆ దిశగా జెడ్పీ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

– అనంతపురం సిటీ



1959లో నిర్మించిన జెడ్పీ కార్యాలయ భవనం ఇలా..





పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల కోసం కేటాయించిన భవనం, కూలేందుకు సిద్ధంగా పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం భవనం



దుస్థితిలో జెడ్పీ కార్యాలయ భవనం

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయండి

రాప్తాడు: అంగన్ వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ వనజాక్షి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె సూపర్‌వైజర్ ఝాన్సీరాణితో కలిసి ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ ఫోన్లలో పథకాల ద్వారా లబ్ధిదారులకు అందజేసిన వివరాలను ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డెస్కులు పిల్లలు కూర్చోవడానికే సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యల్లమ్మ, మాధవి, అంగన్‌వాడీ సహాయకురాలు కే విజయలక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

క్రెడయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్ ప్రదర్శన

అనంతపురం: అనంతపురం నగరంలోని రామన్‌గర్‌లోని రాయల్ పంక్షన్ హాలులో క్రెడయ్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ ఎక్స్‌పో అండ్ బిల్డి టెక్ ఎగ్జిబిషన్‌ను ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు క్రెడాయ్ అనంతపురం అధ్యక్షుడు బోయ తిరుపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన నూతన, అడ్వాన్స్‌డ్ మెటీరియల్‌తో పాటు అనేక నిర్మాణ సామగ్రి గురించి తెలుసుకోవచ్చన్నారు. ఏదైనా ప్లాటుగానీ, ఇల్లుగానీ కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్నట్లయితే వారందరికీ ఒక వేదికను ఏర్పాటు చేసి, రాయితీతో అమ్మకాలు సాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు



47వ డివిజన్‌లో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: గత ఏడాది వరదలతో ప్రజలు పడిన ఇబ్బందులను కళ్లారా చూశా.. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లా..రూ.42కోట్లతో నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపా..భవిష్యత్‌లో ఎలాంటి సమస్యా ఉండదు అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రంగస్వామి నగర్ ప్రజలకు హామీ ఇచ్చారు. శుక్రవారం నగరంలోని 47వ డివిజన్‌లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దుర్గాదేవితో కలిసి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన మేలును లబ్ధిదారులకు వివరించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో రూ.54 కోట్లతో నడిమివంక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో రూ.36 కోట్ల పనులు పూర్తయ్యాక ప్రభుత్వం మారిందని, తర్వాత మిగిలిన రూ.18 కోట్ల పనులను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆ నిధులను చెరువుకట్ట పనులను మళ్లించిందన్నారు.

ఆర్థికంగా మెరుగుపడ్డాం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి, చేయూత, సున్నావడ్డీ తదితర పథకాలతో ఆర్థికంగా మెరుగుపడ్డామని రంగస్వామి నగర్‌కు చెందిన దేవి, సుజాత, తదితరులు ఎమ్మెల్యేతో ఆనందం వ్యక్తం చేశారు. అమ్మ హాస్పిటల్ బేల్దారి పని చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తోందని, ఇళ్ల గడవడమే కష్టంగా ఉన్న తమకు ప్రభుత్వం అందించిన అమ్మఒడి ఎంతో మేలు చేస్తోందని తస్లీంబాను అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎమ్మెల్యేతో సంతోషం వ్యక్తం చేసింది. స్థానికులు హసీనా, వన్నూర్‌బీ, ఫాతిమా, మాధవి, అశోక్, తదితరులు ఎమ్మెల్యేకు వర్తించిన సంక్షేమ పథకాలతోపాటు, పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, టీవీ చంద్రమోహన్ రెడ్డి, ఇస్సాక్, డైరెక్టర్లు గౌస్‌బేగ్, గోవిందు, నాయకులు కృష్ణవేణి, సుజాతరెడ్డి, భారతి, శ్రీదేవి, నాగిరెడ్డి, రత్నమయ్య, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ని కుట్రలు చేసినా టీడీపీని ప్రజలు నమ్మరు'

అనంతపురం క్రైం: మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తన ఉనికిని చాటుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలేదని మేయర్ వసీం పేర్కొన్నారు. ఇటీవల ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ఏర్పాటు, దివంగత నేత అనంత వెంకటరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు రూ.313 కోట్లతో ఫోర్‌వే, బ్రిడ్జ్ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగానే మహాత్ముల విగ్రహాలను తొలగించి భద్రంగా ఉంచామన్నారు. రోడ్డు పనులు పూర్తిగాగానే విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగరాభివృద్ధి కోసం తాము పరితపిస్తుంటే ఏదో కారణంతో అడ్డుకునే ప్రయత్నం చేయడం ఆయన దిగుజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో ఫోర్‌వే పనులతో పాటు నగరంలో రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ పనులు, ఇంకా రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రతి ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రభాకర్ చౌదరి ఆయన కాలమంతా గ్రూపు రాజకీయాలు, గొడవలతోనే గడిచిపోయిందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సుమతి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, ఇస్సాక్ పాల్గొన్నారు.

11న యోగాసన, భగవద్గీత పోటీలు

అనంతపురం కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసన, భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 11న స్థానిక సరస్వతీ విద్యామందిరంలో వ్యాసరచన పోటీలు, 'భారతజాతికి నాహితవు' అనే అంశంపై వక్తృత్వపు పోటీలు, 12న స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కులో యోగాసన పోటీలుంటాయి. వివరాలకు ఈనెల 10లోపు 9963028694 లో సంప్రదించవచ్చు.

ఎస్కేయూ అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను శుక్రవారం ఎస్కే యూనివర్సిటీ అథ్లెటిక్స్ జట్టుకు ఎంపిక చేశారు. క్రీడాకారులు ఈ నెల 9 నుంచి తమిళనాడులోని ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీల పోటీల్లో పాల్గొంటారు. ఎస్కే యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరి శ్రీనివాసన్, కోచ్ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

మాగాణులైన బీడు భూములు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

ఈ ఫొటోలో కనిపిస్తున్న అంకిరెడ్డి జయమ్మ, ఈశ్వర రెడ్డి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత మూడేళ్లలో రూ.5,86,876 లబ్ధి చేకూరింది. ఈ కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.రూ.40,500, వైఎస్సార్ ఆసరా కింద రూ.3,816, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.5,40,333, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.2,227 లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సంక్షేమ పథకాల బ్రోచర్ చదివి వినిపించారు.



అంకిరెడ్డి జయమ్మ, అంకిరెడ్డి ఈశ్వర్ రెడ్డి కుటుంబానికి సంక్షేమ లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఆత్మకూరు: నియోజకవర్గంలో ఉన్న బీడు భూములు కాస్త మాగాణులుగా మార్చి రైతే రాజు అనేలా చేసిన ఘనత మీదే అన్న అంటూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో ఆత్మకూరు మండలం రంగంపేటకు చెందిన రైతులు, మహిళలు కలిసి తమ ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం రంగంపేట గ్రామంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.

నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించదా?
గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల పేరుతో పరిటాల కుటుంబం రూ.కోట్లు దోచుకుందని, ప్రజలకేమి చేశారని పాదయాత్రల పేరుతో తిరుగుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు పాదయాత్రల పేరుతో గ్రామాల్లో గొడవలు, కక్షలు రేపేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈమూడేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజలే చూసి ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో మందికి అండగా నిలిచాన్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా జగనన్న ఇంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మహిళాభివృద్ధి కోసం గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు.

చంద్రబాబు ఎక్కడ కాలు పెట్టినా జనం బలి
మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడ కాలు పెడితే అక్కడ జనం ప్రాణాలు పోగొట్టుకోవాల్సివస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. గోదావరి పుష్కరాలలో 28 మంది ప్రాణాలు పోగా, కందుకూరు సభలో 8 మంది, గుంటూరు సభలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి చంద్రబాబు అధికారంలో కొస్తే రాష్ట్రం కూడా సిగ్గు పడుతుందని తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బర హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ, సర్పంచ్‌లు ఉజ్జినప్ప, గౌతమి, ఎర్రిస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలత, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, అతికి రెడ్డి, గోపాల్‌రెడ్డి, భాస్కర్, ఆదినారాయణ రెడ్డి, కృష్ణా నాయక్, పరిగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని అనంతపురం మునిసిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి అన్నారు. రూడ్‌సెట్ సంస్థలో నిరుద్యోగులకు సెల్‌ఫోన్ రిపేరీ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఉచితంగా ఉపాధి శిక్షణ కల్పిస్తూ ఎంతో మంది జీవితంలో స్వయం ఉపాధితో స్థిరపడేలా చొరవ చూపిస్తున్న రూడ్‌సెట్ సంస్థ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ లోకనాథ రెడ్డి, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎల్‌డీసీఎం నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో పింఛన్ అందజేత

అనంతపురం క్రైం: ఆజాద్‌నగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ ప్రమాదానికి గురై బెంగళూరులో చికిత్స పొందుతోంది. 58వ సచి వాలయం పరిధిలోని వలంటీర్ పుష్పావతి శుక్రవారం అక్కడికెళ్లి పింఛన్ అందజేసింది.

సజావుగా స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వసీం అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం సజావుగా జరిగింది. అజెండాలో పొందుపర్చిన 19 అభివృద్ధి అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. నగరాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు మేయర్ వసీం తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్లలోని 70 మంది కార్మికులకు మూడు నెలలకుగానూ నెలకు రూ.12వేలు చొప్పున చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. నాయక్‌నగర్‌లో సర్వే నంబర్ 344/2బీ ఎల్‌పీ నంబర్ 541/83 నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలానికి సాధారణ నిధులు రూ.31 లక్షలతో ప్రహరీ నిర్మాణం, 49వ డివిజన్ 69వ సచివాలయం పరిధిలోని వివేకానంద నగరపాలక పాఠశాల ప్రహరీ రూ.30 లక్షలతో నిర్మాణం, 32వ డివిజన్ 46వ సచివాలయం పరిధిలో రూ.12.50 లక్షలతో సీసీ రోడ్డు, ఇందిరాగాంధీ ప్రాథమిక పాఠశాల హమాలీకాలనీ, బుడ్డప్పనగర్‌లోని కొత్తగా వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌లకు రూ.28.40 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. 3వ డివిజన్‌లోని 5వ సచివాలయం పరిధిలో నగరపాలక సంస్థ స్థలంలో రూ.49 లక్షలతో ప్రహరీ, 4వ సచివాలయ పరిధిలో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, 8వ డివిజన్ 3వ సచివాలయ పరిధిలో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, 35వ డివిజన్ 52వ సచివాలయం పరిధిలో రూ.12.25 లక్షలతో సీసీ రోడ్డు, 37వ డివిజన్ 54వ సచివాలయ పరిధిలో సిద్ధార్థ పార్క్ అభివృద్ధికి రూ.27 లక్షలు, 34వ డివిజన్ 50వ సచివాలయ పరిధిలో నగరపాలక సంస్థ స్థలానికి రూ.16.75 లక్షలతో ప్రహరీ, అదే డివిజన్‌లో సర్వే నంబర్ 353లోని నగరపాలక సంస్థ స్థలానికి రూ.24.20 లక్షలతో ప్రహరీ, 48వ డివిజన్ 70వ సచివాలయ పరిధిలోని రూ.48 లక్షలతో ప్రహరీ, 34వ డివిజన్ 50,51 సచివాలయ పరిధిలోని మునిసిపల్ స్థలంలో రూ.16.75 లక్షలతో ప్రహరీ, 38వ డివిజన్ 55వ సచివాలయ పరిధిలో రూ.20.50 లక్షలతో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుమతి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, ఇస్సాక్, కమల్‌భూషణ్, ఏసీపీ 2 సువర్ణ, ఆర్‌ఓ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

సంక్షిప్త సమాచారం

క్యాన్సర్‌పై అవగాహన
అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏపీ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట క్యాన్సర్ పై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ప్రతి ప్రభుత్వాస్పత్రిలో ఆకుపచ్చ, నీలం రంగు బ్యానర్‌ను ప్రదర్శిస్తామని డీఎంహెచ్‌ఓ యుగంధర్ తెలిపారు.

యోగాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
అనంతపురం కల్చరల్: ఒత్తిడి తగ్గించుకున్నప్పుడే చురుకైన ఆలోచనలు వస్తాయని, యువత యోగా, ధ్యానంపై శ్రద్ధ పెట్టాలని సీనియర్ యోగా గురువు మహేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఎన్‌వైకే సమావేశ మందిరంలో నెహ్రూయువ కేంద్ర ఆధ్వర్యంలో యోగా ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం ఎన్‌వైకే అధికారులు సందీప్‌కుమార్, శ్రీనివాసులు, ఆర్ట్స్‌కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశావాది శశాంక్‌మౌళి, సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణతి మహేష్‌బాబును సన్మానించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత
అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన చంద్రశేఖర్ నాయక్ ఆకస్మాత్తుగా మృతిచెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ తక్షణ సాయంగా రూ. 10 వేలు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్పొరేటర్ మునిశేఖర్, నాయకులు పాల్గొన్నారు. నగరంలోని 60వ సచివాలయ పరిధిలోని సరస్వతమ్మకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష డబ్బును 41వ డివిజన్ కార్పొరేటర్ గోగుల లక్ష్మీదేవి శుక్రవారం అందించారు. కార్పొరేటర్ దుర్గాదేవి, కన్వీనర్లు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షిస్తాం
అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షిస్తామని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని ఫాతిమా మసీదులో నూతనంగా జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను మసీదు కమిటీ సభ్యులు సన్మానించారు.

చాణిక్య నందా రెడ్డికి ఘన నివాళి
అనంతపురం: జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో గురువారం ఆత్మహత్య చేసుకున్న బీటెక్ విద్యార్థి చాణిక్య నందా రెడ్డికి నివాళులర్పించారు. క్యాంపస్‌లో కళాశాలలో చాణిక్య నందారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సుజాత మాట్లాడుతూ చాణిక్య నందారెడ్డి మృతి చాలా బాధాకరమన్నారు. విద్యార్థులు చాణిక్య నందా రెడ్డిని తలుచుకుని కన్నీరుమున్నీరయ్యారు.

వీసీ వైఖరిపై పలు విమర్శలు: జేఎన్‌టీయూఏ ఉన్నతాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన క్యాంపస్‌లోనే ఉన్నా కనీసం మృతదేహాన్ని పరిశీలించడానికి వెళ్లకపోవడం బాధాకరమని పలువురు అన్నారు.

విచారణ అధికారి నియామకం
అనంతపురం సప్తగిరి సర్కిల్: శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉద్యోగి సుదర్శన్‌పై విచారణ చేపట్టేందుకు విచారణ అధికారిగా పామిడి సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్పను నియమించినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. ఉద్యోగి విధుల్లో నిర్లక్ష్యం, ఇతర ఫిర్యాదులపై శనివారం విచారణ చేపట్టనున్నట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు.

ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలి
ఆత్మకూరు: రబీలో బోరుబావుల కింద సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే పరిహారం వర్తిస్తుందని డీఏఓ చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రంలో ఎంపీపీ సుబ్బర హేమలత అధ్యక్షతన గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్‌కు 3,156 మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచు వరలక్ష్మి, ఏఈఓ సుజిత, వీఎస్ఏ భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాప్తాడు: రబీలో బోరుబావుల కింద పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ శుభకర్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన హంపాపురంలో రైతు భరోసా కేంద్రంలో గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు.

రాప్తాడురూరల్: రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని అనంతపురం ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్ కోరారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి ఆర్‌బీకేలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎంపీఈఓ అపర్ణ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవలు ఎనలేనివి
అనంతపురం సప్తగిరి సర్కిల్: ఫార్మసిస్టుల సేవలు ఎనలేనివని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏపీ ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు మాధవ, చంద్రశేఖర్‌రెడ్డి, కేవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

హైర్ బస్సులు ప్రారంభం

అనంతపురం క్రైం: అనంతపురం డిపో ఆవరణలో శుక్రవారం ఉదయం రెండు హైర్ బస్సులను ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ప్రారంభించారు. అనంతపురం నుంచి నార్పలకు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్ ఆర్ ఆదోని, డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డీఎం నాగభూపాల్, సూపరింటెండెంట్ అవధాని శ్రీపాద, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరు ఎర్రిస్వామి రెడ్డి, రమేష్‌గౌడ్, చాములూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.